క్లుప్తంగా

ఘనంగా లైన్‌మెన్‌ల దినోత్సవం



లైన్‌మెన్‌లను సన్మానిస్తున్న దృశ్యం

పుల్లంపేట : మండలంలోని స్థానిక విద్యుత్ కార్యాలయంలో శనివారం జాతీయ లైన్‌మెన్‌ల దినోత్సవాన్ని సబ్ ఇంజనీర్ కుమార్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ ఇంజనీర్ కుమార్ మాట్లాడుతూ లైన్‌మెన్‌లు తమ ప్రాణాలను పణంగా పెట్టి ప్రజల కోసం నిరంతరం సేవ చేస్తారన్నారు. అనంతరం లైన్‌మెన్‌లను సన్మానించారు. తమ ప్రతిభను గుర్తించినందుకు లైన్‌మెన్‌లు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

వీఆర్‌ఏ బాధితులకు న్యాయం చేస్తాం



సీఐ వరప్రసాద్

గాలివీడు : అక్రమ వసూళ్లకు పాల్పడిన వీఆర్‌ఏ బాధితులు అధైర్యపడాల్సిన పని లేదని, సరైన ఆధారాలతో గాలివీడు పోలీ స్టేషన్‌లో సంప్రదిస్తే తగిన న్యాయం చేస్తామని లక్కిరెడ్డిపల్లి సీఐ వరప్రసాద్ తెలిపారు. శనివారం గాలివీడులో పర్యటించిన ఆయన మాట్లాడుతూ జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు సస్పెండ్ అయిన వీఆర్‌ఏ కోలా రమణపై రెవెన్యూ అధికారులు, బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు తెలిపారు. బాధితులు నగదు ఇచ్చినట్లుగా సరైన ఆధారాలతో తమ వద్దకు వస్తే వారికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

నేటి నుంచి హజరత్ సయ్యద్‌షా బిస్మిల్లా షా ఖాద్రి దర్గా ఉరుసు



ఉరుసుకు ముస్తాబైన దర్గా

సిద్దవటం : మండల కేంద్రంలోని మట్లిరాజుల కోటలోని హజరత్ సయ్యద్ షా బిస్మిల్లా షా ఖాద్రి దర్గాలో ఆదివారం నుంచి ఉరుసు మహోత్సవం నిర్వహించనున్నట్లు ముతవలీ సయ్యద్ షా ముగ్దుమ్‌పీర్ ఖాద్రి తెలిపారు. ఈ సందర్భంగా శనివారం ఆయన మాట్లాడుతూ ఆదివారం సాయంత్రం 4 గంటలకు గంధం, సోమవారం ఉరుసు కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. ముస్లిం సోదరులు హాజరై ఉరుసును జయప్రదం చేయాలన్నారు.

వరకట్నం వేధింపులపై కేసు నమోదు

కలికిరి : అదనపు కట్నం కోసం మహిళను వేధించిన ఘటనలో అత్తింటి వారిపై కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ పూల మనోహర్ తెలిపారు. వివరాలిలా.. మండలంలోని మేడికుర్తి గ్రామం సన్యాసివారిపల్లికి చెందిన షేక్ సాకీరాకు గుర్రంకొండ మండలం తరిగొండకు చెందిన షేక్ సయ్యద్ బాషాతో ఏడాది క్రితం వివాహం జరిగింది. వివాహమైన కొద్ది రోజులకే భర్త, అత్తమామ, బావ తదితరుల నుంచి వరకట్న వేధింపులు మొదలయ్యాయి. పెద్దలు చెప్పినా వేధింపులు ఆగక పోవడంతో పుట్టింటికి చేరుకున్న సాకీరా శనివారం కలికిరి పోలీసులను కలిసి న్యాయం చేయాలని ఫిర్యాదు చేసింది. ఈ మేరకు భర్త, అత్త, మామ, బావ, మరో వ్యక్తి మొత్తం ఐదురుగురిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

విద్యాలయం చుట్టూ మంటలు

బి.కొత్తకోట : స్థానిక ఆదర్శ విద్యాలయం చుట్టూ మంటలు వ్యాపించడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆందోళనకు గురైన ఘటన శనివారం మధ్యాహ్నం జరిగింది. ఆదర్శ విద్యాలయం పక్కనే గుట్ట, ఆ గుట్టపై హాస్టల్ ఉంది. విద్యాలయంలో తరగతులు నిర్వహిస్తున్న సమయంలో చుట్టూ మంటలు వ్యాపించడంతో ప్రిన్సిపాల్ పోలీసులు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. ఏఎస్‌ఐ బొజ్జేనాయక్ చేరుకుని మంటలను స్థానికులతో మంటలు ఆర్పేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. అగ్నిమాపక సిబ్బంది కొద్దిపాటి మంటలను ఆర్పేశారు. మంటలకు విద్యాలయానికి చెందిన బోరుమోటారు వైరు 50 మీటర్లు కాలిపోయింది.

ఇద్దరు నాటుసారా విక్రేతలు అరెస్ట్

కలకడ: ఇద్దరు సారా విక్రేతలను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి 40 లీటర్ల నాటు సారాను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మండలంలోని కోన గ్రామంలో శనివారం పచ్చిపాల కృష్ణమ నాయుడు, వాల్మీకిపురం మండలం మేకలవారిపల్లెకు చెందిన చిరంజీవి కలిసి నాటు సారా విక్రయించడానికి సిద్ధపడ్డారు. గ్రామానికి సమీపంలో విక్రయించడానికి ప్రయతిస్తుండగా ఎస్‌ఈబీ టీమ్ ఇన్‌చార్జ్ ఎంపీడీఓ నారాయణ తమ సిబ్బందితో కలిసి అదుపులోకి తీసుకొన్నారు. వారిని స్థానిక పోలీస్‌స్టేషన్లో అప్పగించడంతో ఎస్‌ఐ తిప్పేస్వామి వారిపై కేసు నమోదు చేశారు.

వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను మెజార్టీతో గెలిపించండి



ఓబులవారిపల్లె: ప్రచారం చేస్తున్న దృశ్యం



రాజంపేట రూరల్: మాట్లాడుతున్న జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి



పెనగలూరు: ప్రచారంలో వైఎస్సార్‌సీపీ నేతలు



నందలూరు: ప్రచారం చేస్తున్న భూమన శంకర్‌రెడ్డి

రాజంపేట రూరల్ : రాష్ట్రాభివృద్ధి కోసం ఎమ్మెల్సీ ఎన్నికలలో వైఎస్సార్‌సీపీ తరపున పోటీ చేస్తున్న అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించుకుందామని జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి పిలుపునిచ్చారు. మండల పరిధిలోని కే బోయనపల్లిలోని ఏఐటీఎస్ కళాశాలలో శనివారం కళాశాల వైస్ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి ఆధ్వర్యంలో కళాశాలలోని ఉపాధ్యాయులు, పట్టభద్రులతో సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జెడ్పీ చైర్మన్ ఆకేపాటి మాట్లాడుతూ ఈ నెల 13వ తేదీ జరిగే ఎమ్మెల్సీ ఎన్నికలలో మొదటి ప్రాధాన్యతా ఓటు పట్టభద్రుల అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డికి, ఉపాధ్యాయ అభ్యర్థి రామచంద్రారెడ్డికి వేసి గెలిపించాలని కోరారు. సమావేశంలో పట్టభద్రుల అభ్యర్థి రవీంద్రారెడ్డి సోదరుడు వెన్నపూస రమాకాంత్‌రెడ్డి, భరత్‌కుమార్‌రెడ్డి, అపుస్మా అధ్యక్ష, కార్యదర్శులు రాఘవరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, వై.నందకిషోర్‌గౌడ్, ఉపాధ్యాయులు, పట్టభద్రులు పాల్గొన్నారు.

నందలూరులో..

నందలూరు(రాజంపేట) : వైఎస్సార్‌సీపీ బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థులు రామచంద్రారెడ్డి, వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలిపించాలని తిరుపతి ఎమ్మెల్యే సోదరుడు, వైఎస్సార్‌సీపీ నేత భూమన శంకర్‌రెడ్డి అన్నారు. శనివారం ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించాలంటూ నందలూరులో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి, వేయించి గెలిపించాలన్నారు. ముఖ్యమంత్రి అమలు చేసిన సంక్షేమ పథకాలే ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపిస్తాయన్నారు. ఎప్పుడు ఎన్నికలు జరిగినా వైఎస్సార్‌సీపీదే వాహ అన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులకు ఓటు వేసే అవకాశం కల్పించడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో ప్రైవేటు ఉపాధ్యాయుల సంఘం నాయకులు శౌరీ, బీమా శ్రీనువాసులు, రమణ, చైతన్య, రాజేష్, బాలాజీ, దేవర, మోడపోతుల శ్రీను, నాయకులు పాల్గొన్నారు.

ఓబులవారిపల్లెలో..

ఓబులవారిపల్లె : పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల శాసనమండలి అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన సోదరుడు వెన్నపూస రమాకాంత్ రెడ్డి పట్టభద్రులను, ఉపాధ్యాయులను కోరారు. శనివారం మండలంలో ఆయన వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులను కలిసి మొదటి ప్రాధాన్యతా ఓటును వెన్నపూస రవీంద్రారెడ్డికి వేసి వేయించి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. అనంతరం సచివాలయాలు, కళాశాలలు, పాఠశాలకు వెళ్లి రవీంద్రారెడ్డికి మద్దతు ఇవ్వాలని అభ్యర్థించారు. కారక్యక్రమంలో సర్పంచ్ జయపాల్ రెడ్డి, రైల్వే కమిటీ బోర్డు సభ్యులు భరత్ కుమార్ రెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ అమర్నాథరెడ్డి, ప్రధానోపాధ్యాయులు రమణయ్య, వెంకటేష్, సురేష్, రవి, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

పెనగలూరులో..

పెనగలూరు : ఎమ్మెల్సీ ఎన్నికలలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని మండల వైస్ ప్రెసిడెంటు కొండూరు విజయ్ రెడ్డి అన్నారు. శనివారం పెనగలూరులో వైఎస్సార్ ఎమ్మెల్సీ అభ్యర్థులు తరఫున వారు ప్రచారం నిర్వహించారు. బ్యాలెట్ నమూనా పత్రాలను ఓటర్లకు పంపిణీ చేస్తూ ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే ఉపాధ్యాయ వైఎస్సార్ సిపి అభ్యర్థి అయిన రామచంద్రారెడ్డి, పట్టభద్రుల వైఎస్సార్‌సీపీ అభ్యర్థి రవీంద్రారెడ్డిలను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు సుబ్బరాయుడు, మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ కేతా చక్రపాణి, ముదిరాజ్ సంఘం రాష్ట్ర డైరెక్టర్ గుండ్లూరు ఈశ్వరయ్య, మండల వ్యవసాయ సలహా కమిటీ మండల చైర్మన్ శ్రీనివాసులరెడ్డి, నల్లపరెడ్డిపల్లి హైస్కూల్ ఎస్‌ఎంసీ చైర్మన్ నాగసుబ్బారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు సానారెడ్డి, శ్రీపతి రెడ్డి, శ్రీనివాసులు, బుజ్జిరెడ్డి పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరానికి స్పందన



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

రాయచోటి టౌన్ : అర్చన విద్యాసంస్థల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన లభించింది. శనివారం రాయచోటి – గాలివీడు రోడ్డులోని అర్చన విద్యాసంస్థల యజమాని మదన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచితంగా కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా డాక్టర్ స్వరూప రాణి, డాక్టర్ శివతేజ, రెటీనా స్పెషలిస్టు డాక్టర్ హారికల ఆధ్వర్యంలో వందలాది మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. అనంతరం కళ్లలో శుక్లాలు ఉన్న వారికి కడపలోని తమ ఆస్పత్రిలో ఉచితంగా ఆపరేషన్లు చేయనున్నట్లు తెలిపారు.

నేటి నుంచి లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు

పెద్దమండ్యం: పాపేపల్లెలో వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. 10 రోజుల పాటు బ్రహ్మోత్సవాలు జరుగుతాయని తెలిపారు. 6న హనుమంత, 7న సింహ , 8న శేష, 9న గజ, 10న గరుడవాహన సేవలు, 11 న కల్యాణోత్సవం, 3న వసంతోత్సవం, సుదర్శన చక్రస్నానం, 14న శయనోత్సవంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని తెలిపారు.

ర్యాగింగ్, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండండి



ర్యాగింగ్ పోస్టర్లను విడుదల చేస్తున్న దృశ్యం

రాజంపేట : విద్యార్థులు ర్యాగింగ్, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని రాజంపేట రూరల్ సీఐ పుల్లయ్య అన్నారు. శనివారం అన్నమాచార్య ఫార్మసీ కళాశాలలో అవగాహన సదస్సుకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టంగా చదవాలన్నారు. ఇటువంటి క్రమంలో క్రమశిక్షణ అలవర్చుకోవాలన్నారు. లక్ష్యసాధనకు కృషిచేయాలన్నారు. ఏఐటీఎస్ వైస్ చైర్మన్ ఎల్లారెడ్డి, ఈడీ అభిషేక్‌రెడ్డిలు మాట్లాడుతూ విద్యార్థులు తల్లితండ్రుల ఆశయాలను నేరవేర్చే దిశగా అడుగులు వేయాలన్నారు. ఎంతో కష్టపడి చదువుకునే అవకాశం కల్పించాలన్నారు. రూరల్ ఎస్‌ఐ భక్తవత్సలం మాట్లాడుతూ విద్యార్థులు ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలన్నారు. విద్యార్థి దశలో ఉన్నత ఆశయాలతో ముందుకు సాగాలన్నారు.

సేంద్రియ వ్యవసాయంతో అధిక దిగుబడి



మాట్లాడుతున్న వేణుగోపాల్‌రెడ్డి

ఒంటిమిట్ట : సేంద్రియ వ్యవసాయంతో అధిక దిగుబడి సాధించవచ్చని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ కార్పొరేషన్ డైరెక్టర్ ఆకేపాటి వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. శనివారం సుస్థిర వ్యవసాయ సంస్థ 20వ వార్షికోత్సవం సందర్భంగా సుస్థిర వ్యవసాయ సంస్థ ప్రతినిధి మామిడి సుబ్బరాయుడు ఆధ్వర్యంలో స్థానిక రైతు భరోసా కేంద్రంలో రైతులతో కలిసి వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన చేతుల మీదుగా కేక్ కట్ చేయించారు. అనంతరం వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ రైతులు క్రిమి సంహారక మందులు వాడకుండా స్వచ్ఛమైన, ప్రకృతి సిద్ధమైన ఆవు పేడ, సేంద్రియ ఎరువుల ద్వారా అధిక దిగుబడి సాధించవచ్చునన్నారు. అలాగే సుస్థిర వ్యవసాయ సంస్థ ప్రతినిధి ఎం.సుబ్బరాయుడు మార్కెట్లో క్రిమి సంహార రహిత పంటలకు ప్రత్యేక గిట్టుబాటు ధర ఉంటుందన్నారు. కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ మేనేజర్ సాయికుమార్, సభ్యులు ప్రతాప్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి



సుబ్రమణ్యంరెడ్డి తహసీల్దార్

రాజంపేట రూరల్ : మార్చి 13న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తహసీల్దార్ ముద్దా సుబ్రమణ్యంరెడ్డి తెలియజేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శనివారం తహసీల్దార్ విలేకర్ల సమావేశం నిర్వహించారు. మండల పరిధిలో రెండు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. పట్టణంలోని మన్నూరు జిల్లా పరిషత్ పాఠశాల, బాలికోన్నత పాఠశాలలో ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు ఓటు హక్కు వినియోగించుకోవచ్చని తెలియజేశారు. మండలంలో 3700 మంది పట్టభద్రులు, 420 మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉన్నారని తెలియజేశారు. దాదాపు 70శాతంకు పైగా ఓటరు స్లిప్‌లు పంపిణీ చేశామన్నారు. పోలింగ్ కేంద్రంలో ఐదు మంది సిబ్బంది అందుబాటులో ఉంటారని తెలియజేశారు. పోలింగ్ సరళిని వెబ్ కాస్టింగ్ ద్వారా రికార్డింగ్ చేస్తున్నామన్నారు. ప్రశాంతంగా ఓటరు ఓటు హక్కును వినియోగించుకునేవిదంగా పోలీస్ బందోబస్తు నిర్వహిస్తారని తెలియజేశారు.

గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకూడదు



మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఎంపీడీఓ పులిరామ్‌సింగ్

సిద్దవటం : రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని సిద్దవటం మండలంలోని 18 గ్రామ పంచాయతీలలో తాగునీటి సమస్య తల్తెకుండా గ్రామ కార్యదర్శులు, ప్రజాప్రతినిధుల సమన్వయంతో సమస్యను పరిష్కరించాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ పులిరామ్‌సింగ్ అన్నారు. మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయం సభా భవనంలో ఎంపీపీ జ్యోతి వెంకటమ్మ అధ్యక్షతన శనివారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన సచివాలయాలకు, రైతు భరోసా కేంద్రాలకు విద్యుత్ సదుపాయం కల్పించాలని, ఎస్‌కేఆర్ నగర్ ఎస్సీకాలనీకి విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసి విద్యుత్ సదుపాయం కల్పిస్తే కాలనీవాసులు నివాస గృహాలకు విద్యుత్ మీటర్లకు దరఖాస్తు చేసుకుంటారని స్థానిక సర్పంచ్ జానకిరామయ్య విద్యుత్ ఏఈ జయచంద్ర దృష్టికి తీసుకెళ్లారు. అంతేకాకుండా మాధవరం-1 పంచాయతీలోని రజకులకు దోబీఖానా ఏర్పాటుకు స్థలం కేటాయించాలని సర్పంచ్ తహసీల్దారు శంకర్‌రావును కోరారు. మండలంలోని భాకరాపేట- మాధవరం-1 వరకు ఆర్ అండ్‌బీ రహదారి పక్కన డ్రైనేజీ నిర్మాణానికి దాదాపు రూ.20 లక్షలు మంజూరయ్యాయని, అధికారుల అనుమతులు పొందాల్సి ఉందని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మానస తెలిపారు. తహసీల్దారు శంకర్‌రావు మాట్లాడుతూ నేకనాపురం రేషన్ బియ్యం సమస్య పరిష్కారమైందని, ఈనెల నుంచి బియ్యం పంపిణీ చేస్తామన్నారు. సింగిల్ విండో అధ్యక్షుడు జ్యోతి జగదీష్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ పి. కొత్తపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాల అవరణలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించాలని లేదంటే విద్యార్థులు ప్రమాదాలకు గురయ్యే అవకాశాలున్నాయని విద్యుత్, విద్యాశాఖల అధికారులకు సమస్యను తెలిపారు. సిద్దవటం బీటు అధికారి రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ గుర్తు తెలియని వ్యక్తులు అడవికి నిప్పు పెట్టడంతో అడవి జంతువులు, అటవీ సంపద దగ్ధమవుతున్నాయని తమ సిబ్బంది మంటలను ఆర్పే ప్రయత్నం చేస్తుండగా మరోవైపు అడవికి నిప్పు పెడుతున్నారని దీంతో అటవీ ప్రాంతంలో సిబ్బంది ఇబ్బందులు పడుతున్నామన్నారు. వేసవి కాలంలో వన్య ప్రాణుల దాహార్తిని తీర్చేందుకు ట్యాంకర్ల ద్వారా నీటిని సాసర్ పీట్లలో నింపుతున్నామన్నారు. వన్య ప్రాణుల నీటి సదుపాయానికి సింగిల్‌విండో అధ్యక్షుడు రూ. 5వేలు అందజేశారు. సర్పంచ్ జానకిరామయ్య డీజల్, సర్పంచ్ సుబ్బమ్మ తాగునీటి ట్యాంకర్‌ను ఏర్పాటు చేస్తామని ముందుకు వచ్చారు. కార్యక్రమంలో తహసీల్దారు శంకర్ రావు, ఎంఈఓ శంకరయ్య, మాధవరం పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ శివకుమార్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ దీపం లక్ష్మిదేవి, ఉపమండలాధ్యక్షుడు మేరువ మల్లేశ్వరి, ఏఈలు మానస, జయచంద్ర, చెన్నయ్య, ఎంపీటీసీ చంద్రశేఖర్‌రెడ్డి, శివయ్య, లక్ష్మిరెడ్డి, చిన్నమ్మ, సుబ్బమ్మ, కో-ఆప్షన్ సభ్యుడు సయ్యద్ నూర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వెంకటలక్షుమ్మ, సర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శులు, వీఆర్‌ఓలున్నారు.

నేడు 'భారతదేశం-ఎన్నికలు' రౌండ్‌టేబుల్ సమావేశం

కడప సెవెన్‌రోడ్స్ : బారత ఎన్నికల సంఘం ప్రభుత్వ నియంత్రణకు అతీతంగా ఉండాలన్న ఉద్దేశ్యంతో సుప్రీం కోర్టు శుక్రవారం వెలువరించిన తీర్పు నేపథ్యంలో ×భారతదేశం-ఎన్నికలు౯ అనే అంశంపై ఆదివారం ఉదయం 10.30 గంటలకు కడపలోని కాగితాలపెంటలో ఉన్న తమ కార్యాలయంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శి రవిశంకర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పార్లమెంటులో చట్టం చేసేవరకు ప్రధాని, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు, సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తితో కూడిన త్రిసభ్య కమిటీ ద్వారా ఎన్నికల కమిషనర్ల నియామకం జరగాలని సుప్రీం కోర్టు చారిత్రాత్మక తీర్పు వెలువరించిన నేపథ్యంలో తాము రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నామన్నారు.

పెండింగ్ జీతాలు, బిల్లులు వెంటనే ఇవ్వాలి



ఇన్‌చార్జ్ పీడీకి వినతిపత్రం ఇస్తున్న అంగన్‌వాడీలు

రాయచోటి అర్బన్ : అంగన్‌వాడీలకు చెల్లించాల్సిన పెండింగ్ జీతాలు, బిల్లులను వెంటనే ఇవ్వాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ. రామాంజులు, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ భాగ్యలక్ష్మి, రాయచోటి ప్రాజెక్టు అధ్యక్షురాలు సిద్దమ్మలు ఐసీడీఎస్ పీడీకి విన్నవించారు. శనివారం మధ్యాహ్నంలో ఐసీడీఎస్ కార్యాలయంలో ఇన్‌చార్జ్ పీడీ ధనలక్ష్మిని కలుసుకున్నారు. వారు మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా అంగన్‌వాడీలకు రెండు నెలల జీతాలు, 3 నెలల కూరగాయల బిల్లులు, సెంటర్ అద్దెలు రాక కార్యకర్తలు అప్పులు చేస్తూ ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాయచోటి ప్రాజెక్టు పరిధిలోని శెట్టిపల్లె, దేవపట్ల అంగన్‌వాడీల మినీ వర్కర్లు, ఆయాలకు అక్టోబరు మాసం జీతం ఇంకా అందలేదన్నారు. పీటీఎం పల్లె, దేవగుడిపల్లె, చర్చివీధి, పెద్దజంగంపల్లె, చిన్నకోడివాండ్లపల్లె కేంద్రాలకు ఆయాలు, వర్కర్లకు 3 నుండి 9 నెలల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ప్రతినెలా ప్రాజెక్టు సమావేశాలు నిర్వహించి టీఏ బిల్లులు విడుదల చేయాలంటూ కోరారు. అరకొరగా తప్ప కూరగాయల బిల్లులు కూడా పూర్తిస్థాయిలో వర్కర్లకు చెల్లించలేదంటూ చెప్పారు. మార్చి నెలాఖరులోపు అన్నిరకాల పెండింగ్ బిల్లులు, జీతాలు చెల్లించాలని, లేనిపక్షంలో బడ్జెట్ లాప్స్‌అయి వర్కర్లకు తీరని నష్టం జరుగుతుందన్నారు. ఈమేరకు పీడీకి వినతిపత్రం సమర్పించారు.

మానవ మనుగడకు మహిళలే ఆధారం



రాజంపేట రూరల్: ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారుల బృందం

రాజంపేట రూరల్ : మానవాళి మనుగడకు మహిళలే ఆధారమని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.చెన్నకృష్ణ అభిప్రాయపడ్డారు. మహిళా దినోత్సవ వారోత్సవాలలో భాగంగా స్థానిక ఏరియా ఆసుపత్రి నుంచి ఆర్టీసీ సర్కిల్ వరకు శనివారం పీపీ యూనిట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ లక్ష్మిప్రసన్న ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం అక్కడ మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ ర్యాలీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవన గమనంలో మహిళల ప్రాధాన్యత మరువలేనిదని కొనియాడారు. కార్యక్రమంలో డాక్టర్‌లు వికాస్, సౌజన్య, పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు పిల్లి పిచ్చయ్య, సీనియర్ అసిస్టెంట్ సిద్దిరామయ్య, టీబీ సూపర్‌వైజర్ పిల్లి జయప్రకాష్, డీఈఓ నీరజ, మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్ పాల్గొన్నారు.

టెక్నాలజీ వాడకంతోనే అధిక నేరాలు

పుల్లంపేట : టెక్నాలజీ అధికంగా వాడటం వలన ప్రస్తుతం నేరాలు అధికమవుతున్నాయని నందలూరు సివిల్ జడ్జి కె.లత తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాలలో భాగంగా శనివారం సైబర్ క్రైమ్‌పై న్యాయ విజ్ఞాన సదస్సును పుల్లంపేటలోని శివాలయంలో శనివారం నిర్వహించారు. ముఖ్యంగా ఫేస్‌బుక్, వాట్సప్ ఇతరులకు షేర్ చేయరాదని, ఒకవేళ ఫొటోలు షేర్ చేస్తే సైబర్ నేరగాళ్లు తమ ఫొటోలను తమ ఆధీనంలోకి తీసుకొని బ్లాక్ మెయిల్ చేస్తారన్నారు. పిల్లలు ఆన్‌లైన్‌లో పబ్జీ గేమ్ ఆడరాదన్నారు. మహిళలు పనిచేసే చోట లైంగిక వేధింపులకు గురైనప్పుడు వాటిని ఎలా ఎదుర్కోవాలో అనే అంశంపై పలు సూచనలు, సలహాలిచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ నరసింహ కుమార్, డిప్యూటీ తహసీల్దార్ ప్రసన్న, మన్నూరు సీఐ పుల్లయ్య, ఎంపీడీఓ ప్రకాశం, మహ్మద్ అలీ, సుబ్బరామయ్య, సుబ్బారెడ్డి, పుల్లంపేట పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాజంపేటలో..

రాజంపేట : మహిళలు చట్టాలపై అవగాహన కల్పించుకోవాలని రాజంపేట జూనియర్ సివిల్ జడ్జి సంధ్యారాణి అన్నారు. ఊటుకూరు గ్రామ సచివాలయంలో న్యాయ విజ్ఞాన సదస్సు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోస్కో యాక్ట్, భరణం, విడాకులు, గృహహింస, వరకట్నం వంటి చట్టాలను బాధిత మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. న్యాయవాది శ్రీనివాసులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఏడీజే ఆదేశాల మేరకు..

3వ అదనపు జిల్లా జడ్జి ఆర్‌వీవీఎస్ మురళీకృష్ణ ఆదేశాల ప్రకారం మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక ఎంపీడీఓ సభాభవనంలో మహిళలతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో న్యాయవాదులు పీఎస్ శ్రీనివాసులు, నాగేశ్వరరావులు మహిళలకు సంబంధించిన చట్టాల గురించి వివరించారు.

లక్కిరెడ్డిపల్లిలో..



రాజంపేట : మాట్లాడుతున్న జడ్జి సంధ్యారాణి

లక్కిరెడ్డిపల్లి : మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని మండల లీగల్ అథారిటీ చైర్మన్, న్యాయవాది చెన్న కృష్ణయ్య పేర్కొన్నారు. లక్కిరెడ్డిపల్లి సివిల్ జడ్జి ఫయాజ్ వినీషా ఆదేశాల మేరకు శనివారం ఏపీ మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. వివాహం చేసుకొని గొడవ అయిన వెంటనే విడాకులు వరకు వెళ్లడం మంచిది కాదన్నారు. తెలియని వయస్సులో ఆత్మహత్యలకు పాల్పడటం, బాల్య వివాహాలు చేసుకున్నా చట్టరీత్యా నేరమన్నారు. ప్రతి ఒక్కరూ బాగా చదువుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించి సమాజంలో మంచి పేరు సంపాదించుకోవాలని ఆయన సూచించారు. కష్టపడి చదివితే మంచి భవిష్యత్తు ఉంటుందని, బాల్యవివాహాలు చేసుకొని విడిపోవడం సరైన నిర్ణయం కాదన్నారు. మహిళలు బాగా చదివి అన్ని రంగాలలో రాణించాలని ఆయన సూచించారు. ప్రిన్సిపాల్ రేఖ, ఉపాధ్యాయులు సూర్యుడు నాయక్, విద్యార్థులు పాల్గొన్నారు.



పుల్లంపేట: మాట్లాడుతున్న జడ్జి లత

ఆలయాల్లో భక్తుల ప్రత్యేక పూజలు



సంబేపల్లె: దర్శనమిస్తున్న లక్ష్మీవేంకటేశ్వరుడు



చిన్నమండెం: అలంకరణలో లక్ష్మీనరసింహుడు

చిన్నమండెం : మండలంలోని దేవగుడిపల్లె గ్రామం జల్లావాండ్లపల్లె గ్రామంలోని మండెం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం మూలవిరాట్ మూర్తిని పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. సమీప ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

లక్ష్మీ వేంకటేశ్వర ఆలయంలో..

సంబేపల్లె : మండలంలోని శెట్టిపల్లె పంచాయతీ అడవికమ్మపల్లెలోని శ్రీ లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని శుద్ధి చేసి వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. ఉదయం నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. భక్తులకు అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు.

సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి



రికార్డులు పరిశీలిస్తున్న సీఐ విశ్వనాథరెడ్డి

ఓబులవారిపల్లె : జిల్లా ఎస్పీ హర్షవర్దన్ రాజు ఆదేశాల మేర నియోజకవర్గంలో జరగబోవు ఎమ్మెల్సీ ఎన్నికలు దృష్ట్యా సమస్యాత్మకమైన గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించామని, నిబంధనలు అతిక్రమిస్తే కేసులు నమోదు చేస్తామని రైల్వేకోడూరు సీఐ విశ్వనాథరెడ్డి హెచ్చరించారు. శనివారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో శాఖాపరమైన తనిఖీలలో భాగంగా ఆయన రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికలలో నిబంధనలు పాటించాలని, లౌడ్ స్పీకర్ వాడేటప్పుడు ఉన్నతాధికారుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. రైల్వేకోడూరులో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఇప్పటికే నియోజకవర్గంలో 65 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేశామని, అలాగే చిట్వేలి మండలంలో నాటు తుపాకీని స్వాధీనం చేసుకున్నామన్నారు. వాహనాల తనిఖీలు ముమ్మరం చేస్తామని, కావున ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే ఎంతటి వారిపైనైనా కేసులు నమోదు చేస్తామన్నారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ వలీ, కానిస్టేబుల్ పి.భాస్కర్, సిబ్బంది పాల్గొన్నారు.